



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 5 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా ఆదివారం 18 జనవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 5 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, SUN 18 JANUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

### నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!

- ప్రపంచ ఆర్థిక సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు
- ఐబీఎం, గూగుల్, మేర్స్క్ సీఈఓలతో కీలక సమావేశాలు
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- తొలిరోజు 20 దేశాల ఎన్నార్టీలతో దయాస్పోరా సమావేశం

- మిగతా 2లో...

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్
- 2027 జూన్ నాటికి గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని వెల్లడి
- గ్రీన్ ఎనర్జీలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఉద్ఘాటన









పెన్ పవర్ డెస్క్:చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం.

వివరాలు 2లో..



## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్

- మిగతా 2లో...

## యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది



- ఈ గెలుపు ద్వారా తమను నిర్వీర్యం చేశామని బీజేపీ నేతలు భావిస్తున్నారన్న థాకరే
- బీజేపీ కుట్రలను త్వరలో బయటపెడతామని వ్యాఖ్య
- ముంబైలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తమ కల అన్న థాకరే

వివరాలు 2లో..

## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు

- ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతోందని మంత్రి పార్థసారథి విమర్శ
- నాడు అసెంబ్లీలో జై కొట్టి, అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని ఆరోపణ
- సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు ఖర్చుపెట్టారని, రాజధానికి మాత్రం అడ్డుపడుతున్నారని ఫైర్
- అమరావతి పనులు వేగవంతం చేశాం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి లక్ష్యమని స్పష్టీకరణ




పెన్ పవర్ డెస్క్:"2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం" అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. "హెల్దీ-హ్యాపీ-వెల్తీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా

- మిగతా 2లో...



## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- అత్యాచార ఘటనకు సంబంధించి వివరాలను వెల్లడించారనే కేసు
- గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదు
- కోర్టు విచారణలకు హాజరుకాని గోరంట్ల మాధవ్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు న్యాయపరంగా తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై విజయవాడలోని పోక్సో ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిరంగంగా వెల్లడించారనే ఆరోపణలతో గోరంట్ల మాధవ్‌పై గతంలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ ఫిర్యాదును మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చారు. ఈ కేసు విచారణకు రావాలంటూ కోర్టు పలుమార్లు నోటీసులు

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

- పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండానే వెళ్లే ప్రయత్నం చేసిన నిందితుడు
- కారును ఆపే ప్రయత్నం చేసిన హిందూ ఉద్యోగి రిపోన్ సాహా
- కారుతో ఢీకొట్టి హత్య చేసిన బీఎన్‌పీ మాజీ నాయకుడు

- మిగతా 2లో...



## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు..

# టీడీపీ కార్యకర్త మృతి

- కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్తత
- దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు
- గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు

- మిగతా 2లో...




## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం..

### వంద మందికి పైగా సోకిన వైరస్

- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్ ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు

2లో...




## పశ్చిమబెంగాల్ దిశానిర్దేశకుడు జ్యోతిబసు

మార్క్సిస్టు యోధుడు, సీపీఐ(ఎం) ఆవిర్భావ నాయకులు, ప్రజా, కార్మిక పక్షపాతి జ్యోతిబసు. నాడు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి గా జ్యోతిబసు లెఫ్ట్ ఫ్రంట్ పాలన రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చివేసిన విషయం దేశమంతా తెలిసిందే. కరువు రాష్ట్రంగా కునారిల్లిన పశ్చిమబెంగాల్‌ను అన్నపూర్ణగా మార్చింది. అణగారిన వర్గాలకు ఇరవై ఐదు లక్షల ఎకరాలను పంచి (భూ సంస్కరణలు చేపట్టి) దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచింది. కష్టజీవులకు, కార్మిక వర్గానికి అండదండలిచ్చింది. అంతర్జాతీయ సౌహార్ధతకు దిక్సూచిగా నిలిచింది. అలాగే ఎల్ఐసి పరిరక్షణకు పూర్తి బాసటగా నిలిచింది. దీనివల్ల,బీమా ఉద్యోగుల పోరాటాలు విజయవంతమయ్యాయి. ”ఇలాకో విజిలు పేరుతో ఆటోమేషన్ (కంప్యూటరీకరణ)కి వ్యతిరేకంగా ఏఐఐఇఏ, జరిపిన పోరాటంలో జ్యోతిబసు లెఫ్ట్‌ఫ్రంట్ శ్రేణులు నిర్వర్తించిన మహత్తరమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు ఎవరూ మర్చిపోలేరు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన ఉన్న సందర్భంగా ఎలాగైనా సూపర్ కంప్యూటర్‌ను ఇన్‌స్టాల్ చేయాలనే ప్రభుత్వ, యాజమాన్య ప్రయత్నాలు ఫలించలేదు. 1968 దసరా సెలవుల్లో కంప్యూటర్‌ను ఇలాకో భవనంలో పెట్టాలని ప్రయత్నాలు, ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో పెద్దఎత్తున ఇలాకో విజిల్ కొనసాగింపు జరిగింది. ఇలాకో భవనం దగ్గర కాళీమాత విగ్రహం పెట్టి దసరా పండగ నిర్వహించారు. జ్యోతిబసు, ఇతర కమ్యూనిస్టు యోధులు, ఇతర రాజకీయ నాయకులు, జాతిన్ చక్రవర్తి, జ్యోతిర్మయి బసుతో బాటు అనేక మంది ఈ విజిల్‌లో పాల్గొన్నారు. 24 పరగణా జిల్లాలోని గిరిజనులు(వీరికి గతంలో కరువు సందర్భంగా అంబలి ఇచ్చి ఎఐఐఈఎ యూనిట్లు వారిని ఆదుకున్నాయి)తమ విల్లంబులతో వచ్చి ఈ విజిల్‌లో పాల్గొన్నారు. 24 గంటలూ, 365 రోజుల పాటు ఈ ఉద్యమం కొనసాగింది.

ప్రభుత్వ అంచనాలు తలకిందులె యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. అప్పటి హోంమంత్రి జ్యోతిబసు ఇలాకో భవనంలో కంప్యూటర్ పెట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని చెప్పారు. చివరకు ఫోర్ట్ విలియమ్స్‌లో మిలిటరీ రక్షణలో ఉన్న కంప్యూటర్‌ను పశ్చిమబెంగాల్ నుండి వెనక్కు తరలించారు. కంప్యూటరీకరణ వ్యతిరేక ఉద్యమం చరిత్రాత్మక విజయం సాధించింది. ఆటోమేషన్ వ్యతిరేక ఉద్యమంలో భారత కార్మిక వర్గానికి దశను, దిశను నిర్దేశిస్తూ ఏఐఐఇఏ సాగించిన ఈ ఉద్యమంలో జ్యోతిబసు ఆధ్వర్యంలో వామపక్ష పార్టీలు అనేక మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులను, మేధావులు భాగస్వాములయ్యారు. కంప్యూటర్ పరిజ్ఞానం మన దేశంలో ప్రాధమిక దశలో ఉన్న నేపథ్యంలో బీమా ఉద్యోగులు ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ఇండియన్ ఆయిల్ కంపెనీలో కంప్యూటరీకరణ విజయవంతంగా చేయగలిగిన ప్రభుత్వం ఎల్ఐసిలో ఓటమి చూడవలసి వచ్చింది. ఒక కంప్యూటర్ వస్తే దాదాపు 24వేల ఉద్యోగాలు ఎలా పోతాయో ఉద్యోగులు అర్థం చేసుకోగలిగారు. వారిని ఈ పోరాటం జాగృతం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులు, కార్మికవర్గ రాజకీయాలు ఈ ఉద్యమానికి కొత్త ఊపునిచ్చాయి. నవంబర్, 67 నుండి మార్చి ,69 వరకు (రాష్ట్రపతి పాలన అమలుఉన్న కాలంలో) అక్కడ ప్రజాతంత్ర ఉద్యమం బీమా ఉద్యోగుల పోరాటాలకు రక్షణాకవచంగా ఉంది. 1969 ఎన్నికలలో యునైటెడ్ ఫ్రంట్ ఎన్నిక బీమా ఉద్యోగుల పోరాట విజ యానికి బాసటగా నిలిచింది. ఆనాడే కంప్యూటర్లు ఎల్ఐసిలో ప్రవేశించి ఉంటే వేలాది మంది ఉద్యోగాలుపోవడమే గాక, సంస్థలో తర్వాత తరాల ఉద్యోగులకే ఉద్యోగ అవకాశాలు ఉండేవి కావు. అందుకే ఈ మహత్తర పోరాటంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రాధాన్యతను, జ్యోతిబసు చిరస్మరణీయమైన పాత్రను ఎల్ఐసి ఉద్యోగులు నిరంతరం జ్ఞాపకం ఉంచుకుంటారు.

1978లో కలకత్తాలో జరిగిన ఏఐఐఇఏ సిల్వర్ జూబ్లి సమావేశాలకు జ్యోతిబసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీమా రంగాన్ని ప్రయివేటుపరం చేయడంతో బాటు, ఎల్ఐసి, జిఐసిలలో యాభైశాతం వాటాలు విక్రయించాలన్న మల్హోత్రా కమిటీ (1994) కమిటీ సిఫార్సు లకు వ్యతిరేకంగా ఆనాడు వామ పక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. జ్యోతిబసు ఆధ్వర్యంలోని పశ్చిమ బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, మల్హోత్రా కమిటీ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఆమోదించింది. అలాగే అప్పటి వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర ప్రభుత్వాలు సైతం ఇదే మాదిరిగా తీర్మానాలు ఆమోదించాయి. ప్రభుత్వ బీమారంగ పరిరక్షణ కోసం ఎల్ఐసి ఉద్యోగులు చేసిన ప్రతి పోరాటానికి సంపూర్ణ సహకారం అందించి, జ్యోతిబసు మొత్తం కార్మిక వర్గంతో బాటు, ఎల్ఐసి ఉద్యోగులకు కూడా ప్రీతి పాత్రులయ్యారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంఅధికారంలో ఉన్నంత కాలం పశ్చిమబెంగాల్‌లో శాంతి, సామరస్యాలు పరిఢవిల్లాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా దేశమంతా మత కల్లోలాలు ప్రజ్వరిల్లినా, పశ్చిమ బెంగాల్‌లో ఒక్క అవాంఛనీయ సంఘటన జరగలేదు. మతోన్మాదశక్తుల పీచమనచడంలో జ్యోతిబసు ప్రభుత్వం స్ఫూర్తివంతమైన పాత్ర పోషించింది. నేడు దేశంలో నెలకొన్న మత ఉద్రిక్తత పరిస్థితులు పురోగామి శక్తులను కలవరపెడుతున్నాయి. ఇటువంటి తరుణంలో జ్యోతి బసు లాంటి పాలనాదక్షుల, రాజనీతిజ్ఞుల అవసరాన్ని మొత్తం దేశం గుర్తిస్తోంది ఎల్ఐసి సంస్థపై, ఉద్యోగులపై, కార్మికవర్గంపై నిరంతరం దాడులు జరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో జ్యోతిబసు జీవితం కార్మిక వర్గానికి, ప్రత్యేకించి బీమా ఉద్యోగులకు ప్రేరణ ఇస్తుంది. ఎల్ఐసి సంస్థను,ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను, దేశ సమ్మిళిత సంస్కృతిని, సెక్యులర్, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి కృషి చేయడమే జ్యోతిబసుకు బీమా ఉద్యోగులిచ్చే నిజమైన నివాళి.

# చరిత్ర తిరగరాయటం తెలుగువాళ్లతోనే సాధ్యం

- మొదటి పేజి తరువాయి

ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ“ అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. “సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది“ అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ‘క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024‘ దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “విశాఖలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం“ అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

తాజాగా, పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ విషాద సంఘటన రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించినట్లు అక్కడి మీడియా వర్గాలు తెలిపాయి. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో రిపోన్ అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, హాషేమ్ తన కారును అతనిపైకి పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే మృతి

చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాషేమ్, అతడి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు ‘నోరా వైరస్’ సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు. బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్డా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి

వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

# యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో తమను నిర్వీర్యం చేశామని భావిస్తున్న బీజేపీ నేతలకు అది ఎప్పటికీ సాధ్యం కాదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ఇది ముగింపు కాదని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ కుట్రలను త్వరలోనే బయటపెడతామని అన్నారు. ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని, అదే నెరవేరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆకాంక్షించారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే బీజేపీ గెలుపొందిందని ఉద్ధవ్ థాకరే ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందని దుయ్యబట్టారు. ముంబైని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. 227 స్థానాలున్న బీఎంసీలో బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) 27 స్థానాలు, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాల్లో విజయం సాధించాయి.

## గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

- మొదటి పేజి తరువాయి

జారీ చేసినప్పటికీ గోరంట్ల మాధవ్ హాజరు కాకపోవడంతో, చివరకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయితే, తనపై జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రీకాల్ చేయాలని కోరుతూ గోరంట్ల మాధవ్ సోమవారం కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసు తదుపరి విచారణలో ఏం జరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## 11 సీట్లకే పరిమితమైనా మీ ‘తాచుపాము‘ బుద్ధి మారలేదు

- మొదటి పేజి తరువాయి

‘జై‘ కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే ‘నై‘ అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు“ అని పార్థసారథి మండిపడ్డారు.

2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు. “సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది“ అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు.

“పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను ‘మేం వస్తే అరెస్ట్ చేస్తాం‘ అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?“ అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి“ అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

# నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు...

ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (జనవరి 18) స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు.

ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు. పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘తెలుగు డయాస్పోరా’ సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నార్టీలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ ‘పొలిటికో’కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

### టెక్ దిగ్గజాలతో కీలక చర్చలు

పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే ‘ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ - ఏపీ అడ్వాంటేజ్‘ అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘ఇండియా లాంజ్‘ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టెడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్-మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు.

### వివిధ అంశాలపై చర్చా వేదికల్లో ప్రసంగాలు

మూడో రోజు పర్యటనలో భాగంగా, ‘హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్‘ అనే అంశంపై జరిగే చర్చా కార్యక్రమంలో, బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించే ‘ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్: ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ‘ సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగిస్తారు. పారిశ్రామిక పురోగతి, వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో కూడా ఆయన పాల్గొంటారు. ఏపీ లాంజ్‌లో కేంద్ర మంత్రులతో కలిసి ‘బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్‘ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

మొత్తంగా ఈ నాలుగు రోజుల పర్యటనలో 3 ప్రభుత్వాల మధ్య సమావేశాలు, 16 మంది పారిశ్రామికవేత్తలతో వన్-టు-వన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యంగా ఆయన పర్యటన సాగనుంది. ఇక జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.

## జిల్లా ప్రగతిని వివరించేలా శకటాల రూపకల్పన జిల్లా కలెక్టర్ డీకే బాలజీ...

మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17:
జనవరి 26న గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పోలీసు కవాతు మైదానంలో జరిగే జిల్లా స్థాయి వేడుకలకు జిల్లా ప్రగతిని వివరించేలా శకటాల రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి శనివారం ఉదయం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శకటాల రూపకల్పనపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలు, జిల్లా ప్రగతిని వివరించేలా శకటాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టిజిఎస్), పేదరిక నిర్మూలన (జీరో పావర్టీ), స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, నీటి నిర్వహణ, నైపుణ్య అభివృద్ధి, కలంకారి, అనుకరణ ఆభరణాలు, పీఎం సూర్య ఘర్, పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ఎంఈ, మచిలీపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్ వంటి ఇతివృత్తాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# హత్యా రాజకీయాలకు పుట్టిల్లు వైసీపీ..ఆద్యుడు జగన్ : ప్రత్తిపాటి

హత్యా రాజకీయాలు...కుల వైషమ్యాలు.. మత విద్వేషాలు వైసీపీ రాజకీయ సిద్ధాంతాల్లో ప్రధాన అధ్యాయాలని ప్రజలకు బాగా తెలుసు : ప్రత్తిపాటి

ప్రశాంతమైన పల్నాడు పల్లెల్లో నెత్తుటి ఏర్లు పారించింది జగన్ కాదా? : ప్రత్తిపాటి

ఆత్మకూరు దళిత కుటుంబాలపై సాగించిన దమనకాండను జగన్ మర్చిపోయాడా : ప్రత్తిపాటి

రెండు కుటుంబాల మధ్య జరిగిన హత్యను ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం.. జగన్ రాజకీయ లబ్ధి కాదా? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17:
చిలకలూరిపేట: ప్రశాంతమైన పల్నాడు జిల్లాను హత్యలు, దురాగతాలు, దోపిడీల కేంద్రంగా మార్చింది జగన్ కాదా? తన ప్రభుత్వంలో పల్నాడులో జరిగిన దారుణాలపై ముఖ్యమంత్రిగా ఏనాడైనా జగన్ స్పందించారా? టీడీపీ నేతలు బొండా ఉమా, బుద్దా వెంకన్నలపై హత్యాయత్నం జరిగినప్పుడు జగన్ కు ప్రజాస్వామ్యం శాంతిభద్రతలు గుర్తురాలేదా? హత్యా రాజకీయాలకు పుట్టిల్లు వైసీపీ.. ఆద్యుడు జగన్మోహన్ రెడ్డి. ప్రశాంతమైన పల్నాడు పల్లెల్లో నెత్తుటి ఏర్లు పారించింది వైసీపీ ప్రభుత్వం కాదా? ఆత్మకూరు దళిత కుటుంబాలపై తన పార్టీ నాయకులు సాగించిన దమనకాండను జగన్ మర్చిపోయారా? చంద్రబాబు తలపెట్టిన ఛలో ఆత్మకూరు పర్యటనకు వెళ్లకుండా నాడు ఆయన ఇంటి గేట్లకు తాళ్లు కట్టి మరీ ఎందుకు అడ్డుకోవడం ఏ విధమైన ప్రజాస్వామ్యమో జగన్ సమాధానం చెప్పాలి. తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతుకోసినప్పుడు జగన్ కు ప్రజాస్వామ్యం



స్ఫురించలేదా? ఎన్నికల వేళ తన పార్టీ ఎమ్మెల్యే ఈవీఎమ్ లు పగలగొట్టి, టీడీపీ ఏజెంట్ పై వీరంగం వేసినప్పుడు జగన్ కు శాంతిభద్రతలు, ప్రజల యోగక్షేమాలు కనిపించలేదా? అధికారంలో ఉన్నప్పుడు నియంత్రత్వం.. ఫ్యాక్షనిజాన్ని అమితంగా ఆదరించి, ప్రజాస్వామ్యానికి... రాజ్యాంగ విలువలకు పాతరేసే జగన్ కు.. నేడు ప్రజలు ఛీ కొట్టాక అవి గుర్తుకురావడం విడ్డూరంగా ఉంది.

**అధికారం కోసమ అమాయకుల్ని బలిచేయడం జగన్ అనాదినుంచి సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడే**

రెండు కుటుంబాల మధ్య జరిగిన హత్యను ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంటగట్టే జగన్ కుటిల రాజకీయాల్ని ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ స్వాగతించరు. వైసీపీ నేతలు శవరాజకీయాలకోసమే బయటకు వస్తారని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. కులాల కుంపట్లు, మత విద్వేషాలు వైసీపీ రాజకీయ సిద్ధాంతాల్లో ప్రధాన అధ్యాయం అని కూడా వారికి తెలిసొచ్చింది. అధికారమే లక్ష్యంగా అమాయకుల్ని బలిచేయడం జగన్ అనాదినుంచి సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడే. తన హయాంలో దురుద్దేశం.. ఆధిపత్యం..అక్కసుతో పల్నాడులో జరిగిన రాజకీయ హత్యలకు ముమ్మాటికీ జగనే బాధ్యుడు. ఆనాడు తన దుర్మార్గ పాలనతో సర్వం కోల్పోయి రోడ్డునపడిన కుటుంబాలకు ముందు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలి. అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# సరస్ మేళా మహిళల ఆర్థిక స్వావలంబనకు పునాది..ఎమ్మెల్యే నసీర్..

పెన్ పవర్, గుంటూరు, జనవరి, 17.
దేశంలో మహిళా ఆర్థిక సాధికారత కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరులో చేపట్టిన సరస్ మేళా సూపర్ సక్సెస్ అయ్యిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరులోని నరసరావుపేట రోడ్డులో ఏర్పాటు చేసిన సరస్ మేళాను ఎమ్మెల్యే నసీర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి ఆయా ఉత్పత్తుల తయారీ, విక్రయాల గురించి డ్వాక్రా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గ్రూపు సభ్యులతో మాట్లాడారు. అక్కడ సంఘాల నిర్వహణ వంటి వాటి వివరాల గురించి ఆరా తీశారు. గుంటూరు నగరంలో ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని అడిగారు. దీనిపై ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులు సానుకూలంగా స్పందించారు. ఫుడ్ కోర్టును పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్ అక్కడ వంటకాల రుచి చూసి .. చాలా బాగున్నాయంటూ కితాబిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఢిల్లీ వంటి మహానగరంలో ఏర్పాటు చేసే ఇలాంటి మేళాలను





గుంటూరు నగరానికి తీసుకురావడం శుభపరిణామమన్నారు. దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల నుంచి 600 ఎస్ ఎస్ జి గ్రూపుల ద్వారా సుమారు 320 స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు డ్వాక్రా సంఘాల మహిళలు తరలి రావడం సంతోషకరమన్నారు. సరస్ మేళా గ్రామీణ మహిళలు, స్వయం సహాయ సంఘాల జీవితాల్లో ఎన్నో సానుకూల మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వ సహకారంతో మహిళలు వ్యాపార రంగాల్లో విజయవంతం కాగలమనే ఆత్మవిశ్వాసం పొందారని చెప్పారు. ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవించగల స్థితికి మహిళలు చేరుకున్నారని వెల్లడించారు. జాతీయ స్థాయి సరస్ మేళా గ్రామీణ మహిళల శక్తి, స్వయం ఉపాధి సామర్థ్యం, నాయకత్వ ప్రతిభకు ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమానికి రూపకల్పన చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళల విజయాలే ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ అని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దేందుకు ఇలాంటి మేళాలు దోహదం చేస్తాయన్నారు.

# కుంభమేళాను తలపించిన సరస్ మేళా : ప్రత్తిపాటి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17:
చిలకలూరిపేట: ఉత్తరాదిన భారీఎత్తున నిర్వహించే కుంభమేళాకు ఏమాత్రం తీసిపోని విధంగా గుంటూరులో ఏర్పాటు చేసిన సరస్ మేళా విజయవంతం అయిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కేంద్ర మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ కృషి, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనల వల్లే ఆల్ ఇండియా డ్వాక్రా బజార్ గుంటూరుకు తరలివచ్చిందని ఆయన తెలిపారు.

శనివారం సాయంత్రం ఆయన గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక కూటమి నాయకులతో కలిసి హౌసింగ్ బోర్డ్ వద్ద ఏర్పాటుచేసిన సరస్ మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఉత్పత్తుల్ని పరిశీలించిన ఆయన.. వాటి తయారీ, నాణ్యత, ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నాక్స్ తిని, టీ తాగారు. బయటకు వచ్చిన అనంతరం విలేకరులతో మాట్లాడారు.

**12 లక్షల మంది సందర్శించారు..**

వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు... నాణ్యమైన తమ ఉత్పత్తుల్ని తక్కువ ధరకే సరస్ మేళాలో అందుబాటులో ఉంచారని ప్రత్తిపాటి చెప్పారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో వివిధ రకాల ఉత్పత్తులు దాదాపు 500 స్టాళ్లలో ఏర్పాటు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల డ్వాక్రా, మెప్మా మహిళల పనితీరు, ఉత్పత్తుల గురించి ఈ రాష్ట్రంలోని వారు తెలుసుకోవడం.. ఇక్కడి ఉత్పత్తులపై వారు అవగాహన పెంచుకోవడం వల్ల స్వయం సహాయక సంఘాల వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. తొలిరోజు నుంచి ఇప్పటివరకు సరస్ మేళాను 12 లక్షల మంది సందర్శించినట్టు నిర్వాహకులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. స్వయం సహాయక సంఘాలను నెలకొల్పిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని, ఆయన మానసపుత్రికలైన డ్వాక్రా, మెప్మా సంఘాలు జాతీయస్థాయిలో పేరుప్రతిష్టలు పొందడం నిజంగా గర్వించాల్సిన విషయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ఆదివారంతో సదస్సు ముగుస్తున్నందున ఇప్పటివరకు చూడని మహిళలుంటే తప్పకుండా మేళాకు హాజరు కావాలని ప్రత్తిపాటి సూచించారు. సరస్ మేళాను సందర్శించిన ప్రత్తిపాటి వెంట.. టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# వాహనాలకు సంబంధించిన వాహన పత్రాలు తప్పనిసరి:

## - చందోలు ఎస్సై వెంకట శివకుమార్:

పిట్టలవానిపాలెం పెన్ పవర్ న్యూస్:
ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చందోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ గారు రెడ్డిపాలెం టోల్ గేటు వద్ద ప్రజలకు ప్రముఖ సూచనలు చేశారు. యువత ఏ విధంగానైన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివలన శారీరక మానసిక ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అలానే సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాటలు ఇతర జూదాలకు సంబంధించిన క్రీడలు ఆడరాదని తెలియపరచనారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని సూచించారు. దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. తన ప్రసంగంలో ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ కోరారు.

# మంగళగిరి ప్రీమియర్ లీగ్4లో ఎమ్మెల్యే ఏలూరి సందడి

## -క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన సాంబన్న

పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 17
విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్4 క్రికెట్ పోటీల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని సందడి చేశారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బోగి ఎస్టేట్స్‌కు చేరుకోగా, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారి వివరాలు తెలుసుకున్నారు. కొద్దిసేపు మైదానంలో క్రికెట్ ఆడి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. తదనంతరం మ్యాచ్‌ను తిలకిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును జ్ఞాపికతో సత్కరించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.




# 'పెన్ పవర్' దినపత్రిక డైరీనీ ఆవిష్కరించిన మండలనేని చరణ్ తేజ

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17:
చిలకలూరిపేట: స్థానిక జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ శనివారం 'పెన్ పవర్' దినపత్రిక డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో 'పెన్ పవర్' వంటి పత్రికలు ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పత్రికా విలువలను కాపాడుతూ నిష్పాక్షికంగా వార్తలను ప్రజలకు అందించాలని సూచిస్తూ, నూతన సంవత్సరంలో 'పెన్ పవర్' దినపత్రిక మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట పెన్ పవర్ రిపోర్టర్ నరసింహాల శ్రీకాంత్ , పల్నాడు జిల్లా సత్యాగ్రహం దినపత్రిక బ్యూరో మరియు ఏపీయూడబ్ల్యూజే ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడపా అశోక్ కుమార్, సాక్షిత ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో తోట మల్లికార్జునరావు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి తిరుణాళ్ల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 17 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి వార్షిక తిరుణాల మహోత్సవానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోటప్పకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా కోటప్పకొండ ఘాట్ రోడ్డు, చిలకలూరిపేట మేజరు ప్రాంతం, భక్తులు బోటింగ్ చేసే ప్రదేశం, పార్కులు, అలాగే కొండపై తిరుణాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే దగ్గరగా పరిశీలించారు. గత సంవత్సరం 25 లక్షల మంది భక్తులు తిరునాళ్లకు హాజరైన నేపథ్యంలో, ఈ సంవత్సరం మరింత రద్దీ ఉండే అవకాశం ఉందని



పేర్కొన్న ఎమ్మెల్యే, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.
కోటప్పకొండ తిరుణాలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆలయ



అధికారులు, పోలీసు శాఖ సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో దాసరి చంద్ర శేఖర్, బండారు పల్లి విశ్వేశ్వరరావు, హనుమంతరావు, కడియాల తాండవ కృష్ణ, మన్నాన్ షరీఫ్, రామకృష్ణ, లింగాల వీరప్పయ్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యూరు గండిగుంటలో భారీ దొంగతనం, సోషల్ మీడియా అప్డేట్స్ నే కారణమా?

మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17:
ఉయ్యూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిగుంట గ్రామంలో గత రాత్రి దొంగతనం జరిగింది. గండిగుంటకు చెందిన జులూరు లక్ష్మీ సందీప్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి పండగ సందర్భంగా ఈ నెల 14వ తేదీన విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ రోజు ఉదయం శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండటంతో పాటు బీరువాలు ఓపెన్ చేసి లాకర్లు పగలగొట్టినట్లు గుర్తించారు. దొంగతనం జరిగినట్లు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.
పరిశీలనలో సుమారు 20 కాసుల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి వస్తువులు దొంగతనానికి గురైనట్లు తెలిసింది.
సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను పిలిపించి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాల సేకరణ కొనసాగుతోంది.
ఇందులో గమనించవలసిన విషయం ఏమిటంటే ఫిర్యాది నివాసముంటున్న భవనంలో ఇంకో మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నప్పటికీ, తాళం వేసినట్లు బయటకు కనబడనప్పటికీ దొంగతనం జరగడానికి ప్రధాన కారణం ఇంట్లో ఎవరూ లేరని పక్కా సమాచారమే అని, అది దొంగలకు ఎలా తెలిసింది ? ఫిర్యాదుదారుడు తాము ఇంట్లో లేమని సోషల్ మీడియాలో పెట్టిన అప్డేట్లు కారణమా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు,
వ్యక్తిగత సమాచారం ప్రతిదీ సోషల్ మీడియాలో లైవ్ అప్డేట్స్ ఇవ్వద్దని విలువైన వస్తువులు ఎక్కువ ఉన్న ఎడల సీసీ కెమెరాలు పెట్టించుకోవాలని, ఇంట్లో అందరూ



ఎక్కడికైనా వెళ్లే సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ఉయ్యూరు టౌన్ సిఐ టీవివి రామారావు తెలియపరిచారు.

# గ్రామ అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు గ్రామస్తుల భాగస్వామ్యం అత్యంత కీలకం

**-ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 17 : కేసానిపల్లి గ్రామంలో రూ.9 లక్షల విలువైన చెత్త సేకరణ వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు
గ్రామాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ పథకాలతోనే సాధ్యమయ్యేది కాదని, ప్రజల భాగస్వామ్యం, దాతల సహకారం కూడా అంతే ముఖ్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు. గ్రామాల పరిశుభ్రత, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామస్తుల చొరవ ఉంటేనే శాశ్వత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. నరసరావుపేట మండలం కేసానిపల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో దాతల సహకారంతో సుమారు రూ.9 లక్షల విలువైన చెత్త సేకరణ వాహనాన్ని గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వాహనాన్ని ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో చెత్త సమస్యను సమర్థవంతంగా పరిష్కరించాలంటే ప్రతి ఇంటి నుంచే చెత్త సేకరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కొత్త వాహనం ద్వారా రోజువారీగా చెత్తను సేకరించి సక్రమంగా పారవేయడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. పరిశుభ్రత పెరిగితే అంటువ్యాధులు తగ్గి, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలకు తోడు గ్రామస్తులు ముందుకొచ్చి దాతల రూపంలో సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. కేసానిపల్లి గ్రామ ప్రజలు చూపుతున్న సామాజిక బాధ్యత భావం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలే ముందుకొస్తే, ప్రభుత్వ సహకారం మరింత వేగంగా ఫలితాలు ఇస్తుందని చెప్పారు. నరసరావుపేట నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని వివరించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే ప్రజల సహకారం కూడా అంతే అవసరమని అయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబం చెత్తను వీధుల్లో పడేయకుండా వేరు వేరుగా సేకరించి వాహనానికి అందజేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, గ్రామాన్ని హరితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి



పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.
విస్తృతంగా ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గట్టుపల్లి సత్యనారాయణ, మన్నాన్ షరీఫ్, అమర్, గద్దె నాగేశ్వరావు, మచ్చు వీరయ్య, మందాడి ప్రభుదాస్, సైకం రామాంజనేయరెడ్డి,పోలూరి వెంకట్, పొత్తూరి శివ ప్రసాద్, మాతంగి బంగారం, షేక్ మీరావలి, మావిడి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు

# తారకరామారావు 31వ వర్ధంతి వేడుకలకు టీడీపీ ఏర్పాట్లు పూర్తి

**జనవరి 18న బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా కార్యక్రమం-సేవా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహణ-పాల్గొననున్న మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం (పెన్ పవర్)జనవరి 17:మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జనవరి 18న జరగనున్న నందమూరి తారక రామారావు గారి 31వ వర్ధంతి కార్యక్రమాలపై పార్టీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, సీనియర్ టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జిల్లా పార్టీ కార్యదర్శి గోపు సత్యనారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఐ. దిలీప్, పార్టీ నాయకులు పిప్పళ్ళ వెంకన్న, తలారి సోమశేఖర్,మండల పార్టీ జనరల్ సెక్రెటరీ కాటం మధుసూదన్ రావు తదితరులు మాట్లాడుతూ
జనవరి 18న బస్టాండ్ సెంటర్‌లో ఉన్న తారక రామారావు విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర పూలమాలలు అర్పించి నివాళులు ఘటిస్తారని, అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి స్వామి , క్లస్టర్ ఇంచార్జి అక్కుమంతి రాజా ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# స్మశాన వాటికల అభివృద్ధిపై ఎమ్మెల్యే పరిశీలన

**పాలపాడు రోడ్డులో తాగునీటి పైప్లైన్ లీకులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు**



నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 17 : నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులో గల స్వర్గపురి2 స్మశాన వాటిక, రావిపాటి రోడ్డులో ఎస్ఎస్ఎన్ కళాశాల పక్కన ఉన్న స్మశాన వాటికను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్మశాన వాటికల్లో మౌలిక వసతులు, పారిశుధ్య పరిస్థితులు, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు అంత్యక్రియల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్మశాన వాటికల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అవసరాలను సమానంగా పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. పాలపాడు రోడ్డు లోని వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటి పైపు లైన్ లీకు అవుతుందని పలు పత్రికల్లో కదనాలు రావడంతో వెంటనే స్పందించి ఆయా ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే పైపు లైన్ మరమ్మత్తులు చేయాలని సంబంధిత మునిసిపల్ అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, మాబు, అత్తలూరి సీతయ్య, నల్లపాటి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# ములకలూరు రైతులకు శుభవార్త

**-మొక్కజొన్న పంటకు రేపు నీటి విడుదల**

**- రైతుల సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ములకలూరు, జనవరి 17 : రైతుల సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ములకలూరు మండల రైతులకు శుభవార్త అందించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్సీతో నేరుగా మాట్లాడి, మొక్కజొన్న పంటకు అవసరమైన నీటిని సోమవారం విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల ములకలూరు ప్రాంత రైతులు పంటలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు వెంటనే స్పందించారు. ఈ మేరకు శనివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసి, రైతులకు అవసరమైన నీటి సరఫరా నిరంతరంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, భవిష్యత్తులో కూడా వ్యవసాయ రంగానికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో ములకలూరు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు



# ముస్లిం ఖబరస్తాన్లో మెగా సానిటేషన్ డ్రైవ్

**-ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి
జనవరి 17 : నరసరావుపేట పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులో గల ముస్లిం మైనారిటీల ఖబరస్తాన్లో శనివారం సాయంత్రం మెగా సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని విస్తృతంగా శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖబరస్తాన్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అయన తెలిపారు. వీధిలైట్ల ఏర్పాటు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ సదుపాయాల కల్పన, పరిసర ప్రాంతాల శుభ్రత వంటి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి వర్గానికి సమానంగా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, మైనారిటీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ముస్లిం మైనారిటీ పెద్దలు, సానిటరీ ఇన్స్పెక్టర్ రమాదేవి, క్రాంతి, అంకమ్మ చోదరి, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతి వేడుకలు

## -నరసరావుపేట బరంపేటలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి

జనవరి 17 : తెలుగు భాషా వైభవాన్ని, కళలు-సాంస్కృతిక సంపదను ప్రపంచ నలుమూలలకు చాటి చెప్పిన విజయనగర సామ్రాజ్య మహావీరుడు, మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతి వేడుకలను శనివారం నరసరావుపేట పట్టణంలోని బరంపేటలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉత్సాహంగా సాగింది. ఈ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హాజరై శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు జాతి గర్వకారణమని, ఆయన పాలన కాలం తెలుగు చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిందని పేర్కొన్నారు. విజయనగర సామ్రాజ్యాన్ని శక్తివంతంగా నిర్మించడమే కాకుండా, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలని ఎమ్మెల్యే కొనియాడారు.



అష్టదిగ్గజాలతో పాటు అనేక మంది కవులను ప్రోత్సహిస్తూ సాహిత్యానికి విశేష ఆదరణ కల్పించారని తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఆయన చూపిన దూరదృష్టి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు కేవలం ఒక వీరయోధుడే కాకుండా, ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా భావించిన పాలకుడని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులు, వ్యాపారులు, కళాకారులు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేసి ప్రజారంజక పాలన అందించారని చెప్పారు. నేటి యువత శ్రీకృష్ణదేవరాయల జీవితం నుంచి దేశభక్తి, ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి, సంస్కృతి పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. చరిత్రను స్మరించుకోవడమే కాకుండా, ఆ మహానుభావుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే జయంతి వేడుకలకు నిజమైన అర్థం ఉంటుందని అన్నారు. ఈ జయంతి కార్యక్రమంలో రాయల్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి కాశీ శెట్టి రోశేశ్వరరావు, చామకూరి వెంకట్రావు, అమ్మ శ్రీనివాస్ నాయుడు, వాసవి, మిరియాల రత్న కుమారి, అలా వేణు, రంగి శెట్టి వేణు, మన్నాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసిన వైఎస్ఆర్సిపి నాయకులు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి

జనవరి 17 : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ గురజాల నియోజకవర్గం లోని మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో సాల్మన్ పై దాడి చేసి హత్య గావించిన వారిని వెంటనే శిక్షించాలని కూటమి ప్రభుత్వం లో రెడ్ బుక్కు రాజ్యాంగం తప్ప అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావటం లేదని సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తూ హత్యలకు పాల్పడుతున్నారని వారికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామ లేదా అని ఆశ్చర్యం కలిగిస్తుందని సల్మాన్





హత్యను ఖండిస్తున్నామని హత్య గావించిన వారిని వెంటనే శిక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ బాబు, పల్నాడు జిల్లా అబ్జర్వర్ పూనూరు గౌతమ్ రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడుదల రజిని, గురజాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డి, పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సమన్వయకర్త నంబూరు శంకరరావు, వినుకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి చిలకా జయపాల్, సింగయ్య, కృపారావు, డేవిడ్, భవనం రాఘవ రెడ్డి, మారూరి జగన్మోహన్ రామలింగారెడ్డి, కాల్వపల్లి బ్రహ్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కొమ్మినేనికి టైమ్స్ ఆఫ్ ఇండియా పురస్కారం.. ప్రజలకే గర్వకారణం : ప్రత్తిపాటి

## -ప్రముఖ వైద్యులు కొమ్మినేని శంకర్ రావును ఘనంగా సన్మానించిన మాజీమంత్రి.

## -కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్ శంకర్ రావుని కలిసి అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కూటమి నాయకులు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17:

చిలకలూరిపేట: కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వ్యవస్థాపకులు, మాకు అత్యంత ఆప్తులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్మినేని శంకర్ రావు కి టైమ్స్ ఆఫ్ ఇండియా పురస్కారం లభించడం నియోజకవర్గ, జిల్లా ప్రజలకు ఎంతో గర్వకారణమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

శనివారం స్థానిక కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు కొమ్మినేని శంకర్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రత్తిపాటి, ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడారు. ప్రజలు గర్వించే స్థాయిలో కొమ్మినేని మరిన్ని అవార్డులు, పురస్కారాలు పొందాలివైద్యసేవల్లో కొమ్మినేని శంకర్ రావు అందించిన సేవలకు గుర్తుగా ప్రముఖ ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా పురస్కారం అందజేయడంపై ఎంతో సంతోషంగా ఉందని, ఆ పురస్కారం రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా మాకు ఆప్తులైన శంకర్ రావు అందుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజలు మెచ్చేలా వారికి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చిలకలూరిపేటలో నంబర్ -1 వైద్యశాలగా పేరు పొందిందన్నారు. ప్రజలందరి చేత మా డాక్టర్ గారు అని పిలిపించుకునే గొప్ప వైద్యులుగా శంకర్ రావు పేరు ప్రఖ్యాతులు పొందారని, ఆయన భవిష్యత్ లో మరిన్ని జాతీయస్థాయి అవార్డులు సాధించి, ఇక్కడి ప్రజలందరూ గర్వించే స్థాయిలో నిలవాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి



సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మక్కెన నరసింహారావు, కంచర్ల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తుంది -ఎమ్మెల్యే వెనిగండ్ల

## గుడివాడ క్లబ్ లో చెస్, బ్యాట్మెంటన్...పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

## పలు క్రీడల్లో స్వయంగా పాల్గొని... యువతను ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## గుడివాడలో క్రీడల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహకరిస్తాం...

మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17:

రాష్ట్రంలో క్రీడల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ది గుడివాడ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న చెస్ , బ్యాట్మెంటన్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్డబ్ల్యూసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు తో కలిసి చెస్ పాడిన ఎమ్మెల్యే రాము, బ్యాట్మెంటన్ ఆడుతూ క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... నేడు సందడి వాతావరణం లో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొనడం సంతోష్ కరమైన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల్లో క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, క్రీడల్లో పాల్గొనడం కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్న పెద్ద అనే వ్యత్యాసం లేకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం , మానసిక ప్రశాంతత కలగడంతో పాటు అనేక రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్లబ్ ఉపాధ్యక్షుడు పొట్లూరి వెంకటేశ్వరరావు , కార్యదర్శి నిమ్మగడ్డ శివశంకర్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్‌రావు, గుడివాడ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# పెడన శ్రీ వాసవి క్షేత్రంలో ధనుర్మాస మహోత్సవములు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు !

## -ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు --- డా. కొల్లూరి





మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17:

పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము లోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయం నందు కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్న) మాట్లాడుతూ....పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము లోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయం నందు పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో శ్రీ వాసవి క్షేత్రము లోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయం నిర్మాణం జరిగి 53 సంవత్సరాల చరిత్రలో ఎన్నడు లేని విధంగా 2025 డిసెంబర్ నెలలో ప్రారంభమై 2026 జనవరి భోగి పండుగ వరకు ప్రతి రోజు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నిత్యం అభిషేకములు ప్రత్యేక పూజలు రెండు రకముల ప్రసాదములు నివేదన శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మామిడి సావిత్రి వారి కార్యవర్గ సభ్యులు అధ్యక్షురాలు కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ వారి కార్యవర్గ సభ్యులు ప్రతిరోజు ఉదయం తిరుప్పావై విష్ణు సహస్రనామం గోవింద నామాలు అత్యంత భక్తి శ్రద్ధలతో చదవడంతో పాటు సహస్ర దీపాల అలంకరణ సంధ్య గొబ్బెములు భోగి పళ్ళు ధనుర్మాసం నెల రోజులు పూజలు రాయించిన భక్తులకు ప్రప్రదముగా 6 రకముల ప్రసాదములు వితరణ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ముత్యాల హారతులు కూడారై సేవ 108 స్టీల్ బౌల్స్ తో శ్రీ స్వామి వారికి మహా ప్రసాదం నివేదన శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతిదేవి గోదాదేవిల వేషధార ముగ్గుల పోటీలు బొమ్మల కొలువు గోదాదేవ కళ్యాణం తదితర కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ధనుర్మాస మహోత్సవములు మహోన్నత విజయానికి కీలక పాత్ర పోషించిన కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ కి వారి కార్యవర్గ సభ్యులకు శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మామిడి సావిత్రి కి వారి కార్యవర్గ సభ్యులకు పెడన మండల ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు డా. చిన్నా కొల్లూరి. చిన్న

# తక్షణమే యూనియన్ కార్యాలయం ఖాళీ చేయాలి... -లంకిశెట్టి డిమాండ్




మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17:

అంతర్జాతీయ సేవా సంస్థ రోటరీ క్లబ్ 2003 జూన్ 27వ తేదీన లక్షల రూపాయలు కేటాయించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మచిలీపట్నంలో ప్రతిరోజు గర్భిణీ స్త్రీలకు అందుబాటులో ఉండే విధంగా పరిచారుకుల పాకశాల చిన్నారుల స్నానాలు గదిని







ఏర్పాటు చేసిన భవనమును చట్ట వ్యతిరేకంగా దాత ఆశయాలను తుంగలోకి తొక్కి ఆ భవనంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ యూనియన్ బిల్డింగ్ గా ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ప్రశ్నించారు. శనివారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ రోగుల కోసం నిర్మించిన బిల్డింగులో యూనియన్ బిల్డింగ్ ఏర్పాటు చేయడం ఆ బిల్డింగులో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కి కేటాయించిన కుర్చీలను ఉపయోగించుకోవడం ఇది అధికార దుర్వినియోగం కాదా అని బాలాజీ ప్రశ్నించారు. ఈ అక్రమ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారి తక్షణ విచారణ జరిపించాలని బాలాజీ కోరారు. యూనియన్ బిల్డింగును ఖాళీ చేయించి దాతలు ఏ ఉద్దేశంతో బిల్డింగ్ నిర్మించారో ఆ ఉద్దేశం నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. చాలామంది చంటి పిల్లలకు స్నానాలు చేయించడానికి తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని గర్భిణీ స్త్రీలకు ప్రసవించిన తర్వాత వారి కొరకు పత్యంతో కూడిన వంటకాలు చేయడానికి సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం అధికారులకు కనిపించటం లేదా అని బాలాజీ ప్రశ్నించారు. జిల్లా ముఖ్య కేంద్రంలో ప్రధాన ఆస్పత్రిలో అంబులెన్సులు అన్నివేళలా అందుబాటులో ఉంచాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో లోపల అంబులెన్సులుజూ అందుబాటులో లేకపోవడం వలన ఆసుపత్రి బయట ప్రైవేటు అంబులెన్సులు ఎక్కువ సంఖ్యలో ఉండి వేలాది రూపాయలు రోగుల నుండి వసూలు చేస్తున్నారని దీనిపై కూడా చర్యలు తీసుకోవాలని బాలాజీ డిమాండ్ చేశారు



# బ్రహ్మయ్య మాదిగ నాయకత్వం బలోపేతం చేస్తాం: కోటా సుబ్బు మాదిగ

## ఎమ్మార్పీఎస్ చిలకలూరిపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా గొర్రెపాటి సుభాషిని నియామకం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17: చిలకలూరిపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం ఆర్ పి ఎస్) బలోపేతమే లక్ష్యంగా చిలకలూరిపేట నియోజకవర్గ నూతన కమిటీని శనివారం ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మాన్య ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు, పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ నాయకత్వంలో చిలకలూరిపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా గొర్రెపాటి సుభాషిని మాదిగను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

**బ్రహ్మయ్య నాయకత్వాన్ని బలోపేతం చేస్తాం: కోటా సుబ్బు మాదిగ**

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటా సుబ్బు మాదిగ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నూతన కమిటీలను నిర్మించి, ఉసురుపాటి బ్రహ్మయ్య నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మహిళా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు పెనుమల అరుణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. తన నియామకానికి సహకరించిన పెద్దలకు సుభాషిని మాదిగ కృతజ్ఞతలు తెలుపుతూ, త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

**ఎస్సీల సమస్యలపై పోరాటం: కలెక్టర్ స్పందించాలని డిమాండ్**

నియోజకవర్గంలోని పలు సమస్యలను నాయకులు ఈ సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎస్సీ కాలనీలకు స్మశానవాటికలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పూడి గ్రామ ఎస్సీల భూములను నేషనల్ హైవే అథారిటీ వారు సేకరించి మూడు నెలలు గడుస్తున్నా, ఇంతవరకు జిల్లా కలెక్టర్ పరిహారం పంపిణీపై స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. వెంటనే భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెనుమల అరుణా మాదిగ, సీనియర్ నాయకురాలు బొంత రాణి మాదిగ, నరసరావుపేట మండల అధ్యక్షులు వేశపోగు తిమోతి మాదిగ, సీనియర్ నాయకులు కొండ మోడీ కోటి మాదిగ, పట్టణ నాయకులు గోళ్లమూడి రాజశేఖర్ మాదిగ, నందిగామ నాని మాదిగ, సురేష్ మాదిగ, బొంత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జనవరి 17: చిలకలూరిపేట: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి, యువ మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేటలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు, ఒంగోలు జాతి ఆవుల అందాల పోటీలు భారీ ఎత్తుతో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహాయ సహకారాలతో రాష్ట్రం గర్వించేలా పోటీలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డు వద్ద గోల్కొండ గార్డెన్స్‌లో జనవరి 18 నుంచి 23 వరకు 6 రోజుల పాటు ఈ పోటీలు జరుగనున్నాయి. పోటీల ఏర్పాట్లను ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. 18న ఉదయం 9 గంటలకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా పోటీలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి రోజూ ఒకరు లేదా ఇద్దరు మంత్రులు ప్రత్యేక అతిథులుగా హాజరై, గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 22 లేదా 23 తేదీల్లో హాజరవుతారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు ఎన్.ఎండీ ఫరూక్, పీ.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనితలకు పోటీల వివరాలు తెలియచేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, దాతల సహకారంతో నిర్వహించే ఈ పోటీలకు ఒంగోలు జాతి ఎడ్ల పోషకులు, రైతులు, అభిమానులకు స్వాగతం. ఎడ్ల పోషణపై రైతుల్లో ఆసక్తి కలిగించడమే లక్ష్యంరైతులకు ఆనందాన్నిస్తూ, ఎడ్ల పెంపకం, పోషణపై ఆసక్తి, స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమని ప్రత్తిపాటి తెలిపారు. పల్నాడు జిల్లాకు ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో ప్రత్యేక ఖ్యాతి ఉంది. మొత్తం 8 విభాగాల్లో (పాలపళ్లు, రెండుపళ్లు, నాలుగుపళ్లు, ఆరుపళ్లు, సీనియర్స్ మొదలైనవి) 150 నుంచి 160 వరకు ఎడ్ల జతలు పాల్గొంటాయి. ప్రతి జతకు గెలుపు–ఓటము సంబంధం లేకుండా కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. పోటీల ప్రధాన నిర్వాహకుడు యలం సాంబశివరావు నిర్దేశకత్వంలో 11 ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు. గతంలో ప్రత్తిపాటి ఆధ్వర్యంలో 4 సార్లు జరిగిన ఈ పోటీలు ఇప్పుడు 5వ సారి మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఎడ్ల అభిమానులు,



రైతులు, ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోటీల ఏర్పాట్ల పరిశీలనకు ప్రత్తిపాటి వెంట జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, పేర్ని వీరనారాయణ, తెల్లప్రోలు వీరయ్య చౌదరి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షుడు జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు మద్దూరి వీరారెడ్డి, మద్దుమాల రవి, మద్దిబోయిన శివ, బత్తినేని శ్రీనివాసరావు, మురకొండ మల్లిబాబు, జంగా వినాయకరావు, పిల్లి కోటేశ్వరరావు, కక్కెర నాగేశ్వరరావు, గోపాలం నాగేశ్వరరావు, తుబాటి శ్రీహరి, మద్దినేని సుబ్బారావు, తోట బ్రహ్మస్వాములు, కోటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా నిర్వహించిన 20వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

బపెన్ పవర్, గుంటూరు, జనవరి 17: గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు గ్రామంలో ఉన్న కాశీవిశ్వేశర ఓపెన్ ఆడిటోరియంలో అభినయ నాటిక పరిషత్ వారు ప్రెసిడెంట్ గద్దె శ్రీనివాస్ అధ్యక్షతన 20వ తెలుగు రాష్ట్రల ఆహ్వాన పోటీలు ఈ సంక్రాతికి 5 రోజులుగా కన్నుల పండుగలా జరుగుచున్నవి. 13 వ తారీఖున మంగళవారం జరిగిన పరిషత్త నాటికలు అమ్మ చెక్కినబొమ్మ మరియు – ఆవేశంలో ఆనందం ఇవి రెండు ప్రదర్శించ బడినవి. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త బలరామకృష్ణా స్పిన్నింగ్ మిల్లు చైర్మన్ వంకాయలపాటి బలరామ కృష్ణయ్య ప్రత్యేక అతిధిగా ఆంధ్ర రత్న సామాజిక సేవా రత్న అవార్డ్స్ గ్రహీత, నేతాజీ మిత్ర మండలి చైర్మన్ ప్రముఖ వ్యాపార వేత్త కొమ్మాలపాటి శ్రీనివాసరావు విశిష్ట అతిధిలుగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపాటి రాము, డాక్టర్ మర్రి పెద్దయ్య, వంకాయలపాటి సూర్యనారాయణ, కోటిలింగయ్య రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి గద్దె లక్ష్మి. కె ఎస్ ఆర్ నేతాజీ మిత్రమశీడలి డైరెక్టర్ పి. శ్రీనివాస్ డాక్టర్ రఘు ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ బాజిబాబు, లాయర్ హరినాధ్ బాబు, కెవికె రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా బలరామ కృష్ణయ్య నల్లపాటి రాము మాట్లాతూ గత 20 సంవత్సరాలు గా అభినయ(గద్దె) శ్రీనివాస్ అటు సినీ రంగంలో ఇటు నాటక రంగం లో రెండు తెలుగు రాష్ట్రలలో కళా రంగానికి ఎనలేని కృషి చేశారు అని నేషనల్ స్థాయిలో అవార్డ్స్ రివార్డ్స్ అందుకున్నారు అని రెండు తెలుగు రాష్ట్ర లలో కొన్ని వందల ప్రోగ్రామ్ లు సొసైటికి మంచి మార్గాన్ని చూపే విధంగా అందించారు. కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అభినయ శ్రీనివాస్ సమాజానికి నిస్వార్ధశీగా కళా రంగానికి నాపిలుపే ప్రభంజనం లాగా నాటక రంగానికి ఎంతో ఉత్సాహంగా రాష్ట్ర వ్యాప్తంగా తన కృషి పట్టుదలతో అందిస్తున్నారు అని ఈరోజు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక చాలా అద్భుతం గా చూసిన ప్రతి వ్యక్తి సమాజానికి మంచి సూచనగా ఉంది అని దాదాపు గంటపాటు ప్రదర్శించే నాటికలలో జ్ఞాపక శక్తితో కధనాన్ని అవపోషణగా చెప్పగలగటం వీరి గొప్ప తనం అని అదే సినిమా రంగంలో అయితే ఒక డైలాగ్ చెప్పాలి అంటే పది టేకులు తీసుకుంటారు అని సినీ రంగం నటులు కన్నా నాటక రంగం కళాకారులు చాలా గొప్పవారు అని అన్నారు. ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కలపది గ్రామాల ప్రజలు ప్రేక్షకులు భారీగా పాల్గొన్నారు.








## శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో దాతల సహాయంతో అన్నప్రసాద భోజనాలు పంపిణీ కార్యక్రమం

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల డిసెంబర్ 17= పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం శ్రీ వాసవి సేవ అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో ఈ వారం దాతలుగా 150 మందికి ఒక దాత సహాయంతో, మరో 150 మందికి సహకరించినవారు ఇల్లూరి పుల్లయ్య ధర్మపత్ని ఆదిలక్ష్మి, పల్లె బాలయ్య కుమారుడు యోగి సహకారం అందించారు ఈ నారాయణ సేవ కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, కొల్లిపర. లీలా కిరణ్, మహిళా కమిటీ సభ్యులు మద్దు హైమావతి, బచ్చు నాగమణి, సూరే ధనలక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, భవనారి అనంతలక్ష్మి, చింతా రాజి, గుండా మహేశ్వరి, కొల్లిపర ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

భట్టిప్రోలు, పెన్ పవర్ జనవరి, 17: వివేకానంద విగ్రహ సమితి ఆధ్వర్యంలో భట్టిప్రోలు స్ఫూర్తి స్థల్ మినీ ట్యాంకుబండ్ వద్ద శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పలువురు పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బందారు శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని, ఆముక్త మాల్యద, భువన విజయం మొదలగు కవితలు స్వయంగా వ్రాయడమే కాకుండా కవి పండితులను సత్కరిస్తూ తెలుగు గౌరవాన్ని దశదిశల దేశమంతటా వ్యాప్తి చెంది గొప్ప రాజుగా కవి పోషకుడిగా కవిగా గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చందులూరి రామకోటేశ్వరరావు, యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, పొన్నపల్లి సత్యనారాయణ, చన్న వెంకట ఉమామహేశ్వరరావు, కటకం సాంబశివరావు, గొడవర్తి మల్లికార్జునరావు,



సోమరౌతు వీరశేఖర రావు, జంజనం హేమశంకరరావు, వేల్పూరు శ్రీనివాసరావు, చింతల మురళీకృష్ణ, తిరువీధుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు




# మెరుగైన ఆరోగ్యం కోసం యోగాతో నిత్య కృత్యాలు ప్రారంభం కావాలి

## కె ఉష ,ప్రముఖ యోగ ట్రైనర్-మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ

మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 17: పెడనశాఖఆధ్వర్యంలో.. విశ్వభారతి హైస్కూల్లో ఈ నెల 10 వ తేదీ నుండి నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమము సందర్భముగా మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు ప్రముఖ యోగ ట్రైనర్ కె.ఉష ని ఘనముగా శాలువ, జ్ఞాపిక తో సత్కరించారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెడన శాఖ అధ్యక్షులు పేరిశెట్టి నాగరవి మాట్లాడుతూ.... యోగామనజీవనకార్యక్రమములోభాగముగామార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి నిత్య కృత్యాలు యోగా తో ప్రారంభం కావాలన్నారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెడన శాఖ చైర్మన్, విశ్వభారతి హైస్కూల్ ఎ.వి. జి.ఎస్. ఆర్. ప్రసాద్ ( గౌరీ) మాట్లాడుతూ విద్యార్థులలో పరీక్షల వల్ల ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఉపకరిస్తుంది అన్నారు. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెడన శాఖ కో చైర్మన్ వూటుకూరి సుబ్బారావు మాట్లాడుతూ నిత్యం యోగా ప్రాక్టీస్ చేయడం వల్ల మానసిక ప్రశాంతత, జ్ఞాపక శక్తి, ఏకాగ్రత అభివృద్ధి చెందుతాయని అన్నారు. యోగా ట్రైనర్ కె ఉష మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం పెంపొందింప చేయుటలో యోగా పాత్ర ప్రముఖమైనదన్నారు. నిత్యం యోగా సాధన ద్వారా మనిషి ఆయు ప్రమాణం పెరుగుతుంది అని మన పూర్వీకుల నుండి మనం తెలుసుకోవచ్చు అన్నారు. ఆరోగ్యం మెరుగు పరుచుకోవడానికి యోగా ఉత్తమ చికిత్సా విధానం అన్నారు. యోగా సాధన సమయములో అనుసరించే ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని కాపాడుటలో దోహద పడతాయి అన్నారు. మెరుగైన ఆరోగ్యం కోసం యోగా తో నిత్య కృత్యాలు ప్రారంభం కావాలి అన్నారు. ప్రతి రోజు కు క్రమం తప్పకుండా సమయ పాలన పాటిస్తూ యోగ శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థిని అస్మ, తాము శిక్షణ కార్యక్రమములో నేర్చుకున్న అన్ని అంశాలను అందరి ముందు ప్రదర్శించి అభినందనలు పొందినది. మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు ఆమెను ప్రత్యేక బహుమతితో అభినందించారు. విద్యార్థులలో యోగా పట్ల ఒక పూర్తి అవగాహన కల్పించిన ప్రముఖ యోగ ట్రైనర్ కె ఉష గారిని ప్రత్యేకముగా అభినందించిన ఈ కార్యక్రమములో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెడన శాఖ ఛైర్మన్ ఎ.వి.జి.ఎస్. ఆర్ ప్రసాద్(గౌరీ), కో చైర్మన్ వూటుకూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కాగిత శంకర సాంబశివరావు, కోశాధికారి కొట్టు కోటేశ్వరరావు, మానవత సభ్యులు అబ్దుల్ కుర్షిద్ బేగం ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# మూడుతరాలను మెప్పించిన మహానటుడు చిరంజీవి..

## -.డైరెక్టర్ అనిల్ రావిపూడి..



బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 17. దక్షిణ భారత తెలుగు సినీ పరిశ్రమలో తన అభినయంతో , నృత్యాలతో , ఫైట్లతో మూడు తరాల ప్రజలను మెప్పించిన ఒకే ఒక నటుడు మెగాస్టార్ చిరంజీవి అని ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ వస్తున్నారు సినిమా ఘనవిజయం సాధించిన సందర్భంగా చిత్ర దర్శకులు శనివారం నగరంలోని నాజ్ థియేటర్ , మైత్రి మాల్ లలో అభిమానులతో కలిసి విజయోత్సవాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో చెరగని సంతకం చిరంజీవి అంటూ వ్యాఖ్యానించ్చారు. సినీ పరిశ్రమలో చిరంజీవి సాధించిన విజయాలు , నెలకొల్పిన రికార్డులు మరొకరికి అసాధ్యమన్నారు. ప్రజల హృదయాల్లో చిరంజీవి స్థానం శాశ్వతమని , ఇంతటి ఘనవిజయాన్ని అందించిన మెగా అభిమానులకు అనిల్ రావిపూడి కృతజ్ఞతలు తెలిపారు. తోలుత అనిల్ రావిపూడికి దర్శకుడు అనిల్ రావిపూడి కి జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి... చిరంజీవి అభిమానులు మేకల రవీంద్రబాబు , గిడుతూరి సత్యం , సుధాకర్ రెడ్డి , శరత్ ఘనస్వాగతం పలికారు. అనంతరం మైత్రి మాల్ లో కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. కార్యక్రమంలో జనసేన నేతలు బందెల నవీన్ , ఫణిశర్మ , పవన్ , బద్రి , బాలాజీ , స్వామి , వీరమహిళలు మల్లేశ్వరి , ఆసియా , అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్ కె.మయూర్ అశోక్ ని జిల్లా కలెక్టర్ ఏ.తామీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందల్ మర్యాదపూర్వంగా కలిసి, నగర అభివృద్ధి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు...



బపెన్ పవర్, గుంటూరు, జనవరి, 17. తొలుత కమిషనర్ చాంబర్ లో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు, సీనియర్ సిటిజన్స్, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని అన్ని రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. అనంతరం జరిగిన విభాగాధిపతుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరికి వస్తున్నందున పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సోమవారం నుండి ప్రతి విభాగం సమగ్ర సమీక్ష చేస్తామని, అందుకు తగిన విధంగా సమాచారం సిద్దం చేయాలన్నారు.



# ఒంటిపై పుట్టు మచ్చలు పుట్టుకొస్తున్నాయా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒంటిపై కొత్త పుట్టుమచ్చలు అకస్మాత్తుగా కనిపించడం, పుట్టుమచ్చలు పెద్దగా పెరగడ వంటి లక్షణాలు కనిపిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇది ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంపై పుట్టుమచ్చలు సర్వసాధారణం. కొందరు వీటిని అందానికి చిహ్నంగా భావిస్తారు. మరికొందరికి ఇవి అసహ్యంగా మారుతాయి. ఒంటిపై కొత్త పుట్టుమచ్చలు అకస్మాత్తుగా కనిపించడం, పుట్టుమచ్చలు పెద్దగా పెరగడ వంటి లక్షణాలు కనిపిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇది ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది చిన్న పుట్టుమచ్చలతో ఏం సమస్య ఉంటుందిలే అని నిర్లక్ష్యం చేస్తుంటారు. మన చర్మంలో మెలనిన్ అనే వర్ణద్రవ్యం ఉండటం వల్ల మచ్చలు ఏర్పడతాయి. చర్మంపై మెలనోసైట్లు అనే కణాలు ఒకే చోట చేరి ఎక్కువ వర్ణద్రవ్యం ఉత్పత్తి చేసినప్పుడు అది ఒక చిన్న మచ్చగా కనిపిస్తుంది. ఇవి నలుపు, గోధుమ, లేత గులాబీ లేదా నీలం రంగులో ఉండవచ్చు. సగటు వ్యక్తి శరీరంపై 10 నుంచి 40 పుట్టుమచ్చలు ఉండటం సాధారణం. అంతకంటే ఎక్కువ ఉంటే మీరు దానిని విస్మరించకూడదు. మీ ఇంట్లో ఎవరి ఒంటిపై అయినా చాలా పుట్టుమచ్చలు ఉంటే అవి తరువాతి తరానికి సంక్రమించే అవకాశం ఉంది. యుక్తవయస్సు లేదా గర్భధారణ సమయంలో సంభవించే హార్మోన్లలో మార్పులు కొత్త మచ్చలు కనిపించడానికి కారణమవుతాయి.

సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు మెలనిన్ ఉత్పత్తిని వేగవంతం చేస్తాయి. అందుకే సూర్యరశ్మికి గురయ్యే శరీర భాగాలపై మచ్చలు ఎక్కువగా కనిపిస్తాయి. వయసు పెరిగే కొద్దీ చర్మంలో వచ్చే మార్పులు మచ్చలు పెరగడానికి దారితీస్తాయి. పుట్టు మచ్చలు ఎప్పుడు ప్రమాదకరంగా మారుతాయి? చాలా పుట్టుమచ్చలు ప్రమాదకరం కాదు. అయితే ఒక పుట్టుమచ్చ అకస్మాత్తుగా పరిమాణం పెరిగితే మీరు వైద్యుడిని సంప్రదించాలి. పుట్టుమచ్చలో రెండు లేదా మూడు రంగులు కనిపిస్తే, లేదా అది నల్లగా మారితే విస్మరించకూడదు. పుట్టుమచ్చ ఉన్న ప్రదేశంలో నిరంతర దురద లేదా నొప్పి ఉంటే. ఒక పుట్టుమచ్చ నుంచి ఎటువంటి గాయం లేకుండా రక్తస్రావం అవుతుంటే దానిని విస్మరించకూడదు. ఇటువంటి మార్పులు చర్మ క్యాన్సర్ ప్రారంభ సంకేతాలు కావచ్చు. కాబట్టి వాటిని విస్మరించడం మంచిది కాదు.

# జుట్టు రాలడం ఆగిపోవాలంటే..

ఎవరికైనా కొంచెం జుట్టు రాలితే వెంటనే షాంపూ, నూనె, సీరమ్‌లను మారుస్తారు. కానీ అసలు సమస్య మీరు రోజూ తీసుకునే ఆహారం నుంచే మొదలవుతుందని మీకు తెలుసా...? జుట్టు పల్చబడటం, మెరుపు కోల్పోవడం, రాలిపోవడం కాలుష్యం వల్ల మాత్రమే కాదు ప్రోటీన్ లోపం కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. జుట్టు రాలడం అందరిలో కనిపించే సాధారణ సమస్య. ఎవరికైనా కొంచెం జుట్టు రాలితే వెంటనే షాంపూ, నూనె, సీరమ్‌లను మారుస్తారు. కానీ అసలు సమస్య మీరు రోజూ తీసుకునే ఆహారం నుంచే మొదలవుతుందని మీకు తెలుసా?? జుట్టు పల్చబడటం, మెరుపు కోల్పోవడం, రాలిపోవడం కాలుష్యం వల్ల మాత్రమే కాదు ప్రోటీన్ లోపం కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. శరీరానికి తగినంత ప్రోటీన్ లభించకపోతే అది దాని ప్రాధాన్యతలను మార్చుకుంటుంది. గుండె, మెదడు వంటి ముఖ్యమైన అవయవాలకు ప్రోటీన్‌ను పంపుతుంది. జుట్టు పెరుగుదలను ఆపుతుంది. ఈ అంతర్గత పోషక లోపాన్ని సరిగ్గా గుర్తించి, ఆహారం ద్వారా జుట్టును మళ్ళీ బలోపేతం చేయడం వల్ల సమస్య నివారణ అవుతుంది. సాధారణ వ్యక్తి శరీర బరువు కిలోగ్రాముకు 0.8 నుంచి 1 గ్రాము ప్రోటీన్ తీసుకోవాలి. ఉదాహరణకు 60 కిలోల బరువున్న వ్యక్తి రోజుకు 50 నుంచి 60 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. అయితే అధిక కార్బోహైడ్రేట్ తీసుకోవడం చాలా మందిలో ప్రోటీన్ లోపానికి దారితీస్తుంది. ఇది



మాత్రమే కాదు. మీ జీర్ణవ్యవస్థ కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే ఇది ప్రోటీన్ తీసుకోవడం గురించి మాత్రమే కాదు.. శరీరం దానిని ఎలా గ్రహిస్తుందో కూడా ముఖ్యం. మీకు గ్యాస్, ఆమ్లత్వం, జీర్ణ సమస్యలు ఉంటే మీరు తీసుకునే ప్రోటీన్ సరిగ్గా గ్రహించబడకపోవచ్చు. అందువల్ల జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి జీర్ణవ్యవస్థను మెరుగుపరచడం కూడా ముఖ్యం.

# ఉల్లిపాయలు కొనేముందు ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..



మార్కెట్ కి వెళ్లినప్పుడు ఉల్లిపాయలు చూడగానే అన్నీ బానే ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ ఇంటికి తెచ్చాక అవి లోపల నల్లగా ఉండటమో లేదా కుళ్లిపోవడమో చూసి చికాకు వేస్తుంది. ముఖ్యంగా ధరలు పెరిగినప్పుడు ఇలా జరిగితే జేబుకు చిల్లు పడ్డట్టే.. మరి ఎక్కువ రోజులు మన్నే గట్టి ఉల్లిపాయలను ఎలా గుర్తించాలి..? వంటగదిలో ఉల్లిపాయ లేనిదే ఏ కూర పూర్తి కాదు. అయితే చాలా సార్లు మనం మార్కెట్ నుండి తెచ్చిన రెండు మూడు రోజులకే ఉల్లిపాయలు కుళ్లిపోవడం లేదా మొలకలు రావడం గమనిస్తుంటాం. దీనివల్ల వంటకు ఇబ్బంది కలగడమే కాకుండా ఆర్థికంగానూ నష్టం వాటిల్లుతుంది. ఉల్లిపాయలు ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే, వాటిని కొనేటప్పుడే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మంచి ఉల్లిపాయను గుర్తించడానికి మొదటి మార్గం దానిని తాకి చూడటం. ఉల్లిపాయను చేత్తో పట్టుకుని నొక్కినప్పుడు అది గట్టిగా ఉండాలి. ఒకవేళ అది మెత్తగా లేదా స్పాంజ్ లాగా అనిపిస్తే, అది లోపలి నుండి కుళ్ళిపోవడం ప్రారంభించిందని అర్థం. ఉల్లిపాయ తొక్క కాగితంలా పల్చగా, పొడిగా ఉండాలి. ఒకవేళ తొక్క తేమగా ఉన్నా లేదా పైన తడి తగిలినా అది త్వరగా మొలక వచ్చే అవకాశం ఉంది. అలాగే తొక్క మెరుస్తూ, స్పష్టమైన రంగులో ఉండేలా చూసుకోవాలి. ఉల్లిపాయ పైన నల్లటి పొడిలాంటి మచ్చలు లేదా బూజు కనిపిస్తే వాటిని అస్సలు కొనకండి. ఇవి శిలీంధ్రాల వల్ల ఏర్పడతాయి. అటువంటి ఉల్లిపాయలను మిగిలిన వాటితో కలిపి ఉంచితే, మంచివి కూడా త్వరగా పాడైపోతాయి. తాజా ఉల్లిపాయలకు ఎటువంటి వింత వాసన ఉండదు. కానీ, ఒకవేళ ఉల్లిపాయ నుండి ఘాటైన లేదా ఒక రకమైన కుళ్ళిన వాసన వస్తుంటే, అది లోపలి నుండి పాడైందని గుర్తించాలి. ముఖ్యంగా ఉల్లిపాయ పైభాగం దగ్గర వాసన గమనించడం ముఖ్యం. ఉల్లిపాయలు కొన్న తర్వాత వాటిని ప్లాస్టిక్ కవర్లలోనే ఉంచడం పెద్ద పొరపాటు. ఉల్లిపాయలను ఎప్పుడూ గాలి తగిలే బుట్టల్లో లేదా పొడి ప్రదేశంలో ఉంచాలి. బంగాళదుంపలు, ఉల్లిపాయలు కలిపి ఉంచకూడదు. ఎందుకంటే బంగాళదుంపలు విడుదల చేసే వాయువుల వల్ల ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తుతాయి.

# పాదాల పగుళ్లను నయం చేసే ఇంటి చిట్కాలు..

శీతాకాలం పొడి వాతావరణంలో మడమలు పగుళ్లు ఏర్పడటం సాధారణ సమస్య. మడమలు పగిలిపోతే, గోరువెచ్చని నీటిని ఉపయోగించడం, స్క్రబ్బింగ్ చేయడం, నూనెతో మసాజ్ చేయడం వంటి ఇంటి నివారణలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ సమస్యను విస్మరించడం వల్ల నొప్పి, ఇన్ఫెక్షన్ వస్తుంది. శీతాకాలం పొడి వాతావరణంలో మడమలు పగుళ్లు ఏర్పడటం సాధారణ సమస్య. ఈ సమస్యను విస్మరించడం వల్ల నొప్పి, ఇన్ఫెక్షన్ వస్తుంది. ఈ సమస్య ప్రధానంగా చర్మంలో తేమ లేకపోవడం వల్ల వస్తుంది. దీని కోసం రాత్రి పడుకునే ముందు ఒక టబ్‌లో గోరువెచ్చని నీటిని తీసుకుని దానికి కొంచెం సముద్రం ఉప్పు, నిమ్మరసం కలపాలి. ఆ తర్వాత మీ పాదాలను ఈ నీటిలో 15-20 నిమిషాలు నానబెట్టాలి. ఇది మృత కణాలను మృదువుగా చేసి తొలగించడం సులభం చేస్తుంది. ఇలా మీ పాదాలను నానబెట్టిన తర్వాత ప్యూమిస్ స్టోన్ లేదా ఫుట్ స్క్రబ్బర్‌తో మీ మడమల మీద ఉన్న మృత చర్మాన్ని సున్నితంగా రుద్దాలి. ఇది పగుళ్లను నయం చేయడానికి సహాయపడుతుంది. పాదాలను ఆరబెట్టిన తర్వాత కొబ్బరి నూనె, ఆముదం లేదా ఆలివ్ నూనెతో మసాజ్ చేయాలి. నిమ్మరసాన్ని వాసెలిన్‌లో కలిపి పగుళ్లపై పూయడం వల్ల అవి త్వరగా నయమవుతాయి. తేనెలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. అర బకెట్ గోరువెచ్చని నీటిలో ఒక కప్పు తేనె కలిపి అందులో మీ పాదాలను నానబెట్టడం వల్ల చర్మం మృదువుగా ఉంటుంది. అలాగే పండిన అరటిపండును చూర్ణం చేసి మీ మడమల మీద 15 నిమిషాలు అప్లై చేసి ఆపై మీ పాదాలను కడిగేసినా మంచి ఫలితం ఉంటుంది. ఈ చిట్కాలను అనుసరించిన తర్వాత మీ మడమలకు క్రీమ్ లేదా నూనె రాసుకోవాలి. కాటన్ సాక్స్ ధరించి నిద్రపోవాలి. ఇది తేమను నిలుపుకోవడంలో సహాయపడుతుంది. ఇలా చేయడం వల్ల



మీ పాదాలు వేగంగా నయం అవుతాయి.

# అమ్మాయిలు రాత్రిపూట ఎందుకు జుట్టు దువ్వకూడదు?



ఇంట్లో పెద్దలు చెప్పే నీతి సూత్రాల వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. ఇలాంటి అతి ముఖ్యమైన నియమాలలో ఒకటి మహిళల జుట్టు సంరక్షణ. జుట్టు దువ్వడానికి సరైన సమయం అంటూ ఒకటి ఉందట. పురాతన కాలం నుంచి అమ్మమ్మలు, నానమ్మలు రాత్రిపూట జుట్టు దువ్వడం, జుట్టు జడ వేయకుండా వదులుగా వదిలేయకూడదని చెబుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో జీవన విధానానికి సంబంధించి ఎన్నో విషయాలు ప్రస్తావించారు. ఏ సమయంలో ఏది చేయాలి? ఎలాంటి మార్గంలో జీవించాలి వంటి విషయాలు మన పూర్వికులు పేర్కొన్నారు. వీటినే ఆచారాలు, సంప్రదాయాలు అనే ముసుగులో నేటికీ పాటిస్తున్నారు. వీటి వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి మరి. ఇలాంటి అతి ముఖ్యమైన నియమాలలో ఒకటి మహిళల జుట్టు సంరక్షణ. జుట్టు దువ్వడానికి సరైన సమయం అంటూ ఒకటి ఉందట. పురాతన కాలం నుంచి అమ్మమ్మలు, నానమ్మలు రాత్రిపూట జుట్టు దువ్వడం, జుట్టు జడ వేయకుండా వదులుగా వదిలేయకూడదని చెబుతున్నారు. ఇలా చెప్పడం వెనుక ఉన్న ఖచ్చితమైన కారణాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.. శాస్త్రాల ప్రకారం.. సూర్యాస్తమయం అంటే పగలు, రాత్రి కలిసే సమయం. ఈ సమయం తర్వాత వాతావరణంలో ప్రతికూల శక్తి, దుష్ట శక్తులు సక్రియం అవుతాయని నమ్ముతారు. రాత్రిపూట వదులుగా ఉన్న జుట్టు వదిలేసినా, చింపిరి జుట్టు ప్రతికూల శక్తులను తనవైపుకు ఆకర్షిస్తుందట. దీని కారణంగా మహిళలు మానసిక క్షోభ అనుభవించవచ్చు. సాయంత్రం వేళ లక్ష్మీదేవి వస్తుందని నమ్ముతారు. ఇలాంటి సమయాల్లో జడ వేయకుండా జుట్టు వదిలేయడం వల్ల మీ ఇంటిని మురికిగా భావించి, పేదరికానికి ఆహ్వానిస్తుందని నమ్మకం. దేవాలయాన్ని సందర్శించేటప్పుడు ఎల్లప్పుడూ జుట్టు జడ వేసుకునే వెళ్లాలి. ఎందుకంటే వదులుగా ఉన్న జుట్టు పరధ్యానానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. జుట్టు స్త్రీ అందానికి ఆభరణం. కానీ దానిని వదులుగా ఉంచడం మంచిది కాదని శాస్త్రాలు చెబుతున్నాయి. పురాతన నమ్మకాల ప్రకారం దుఃఖ సమయాల్లో మాత్రమే జుట్టు వదులుగా ఉంటుంది. కాబట్టి సంతోషకరమైన జీవితం, ఇంటి శ్రేయస్సు కోసం మహిళలు జడ వేసుకోవాలి. చాలా మంది అమ్మాయిలకు రాత్రిపూట జుట్టు వదిలేసి నిద్రపోయే అలవాటు ఉంటుంది. కానీ వాస్తు శాస్త్రం ప్రకారం ఇది తప్పు. రాత్రిపూట జుట్టు వదులుగా ఉంచి నిద్రపోవడం కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పురోగతిపై చెడు ప్రభావం చూపుతుందని నమ్మకం. జుట్టు దువ్వేటప్పుడు ఊడిన జుట్టును పారవేసేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. ఊడిన జుట్టును వీధిలో లేదా జనాలు తిరిగే ప్రదేశంలో వేయకూడదు. కొంతమంది దానిని ప్రతికూల ప్రయోజనాల కోసం, మంత్రవిద్యల కోసం ఉపయోగించే అవకాశం ఉంది. కాబట్టి, ఊడిని జుట్టును సురక్షితమైన స్థలంలో మాత్రమే పారవేయాలి.

# టెన్షన్ పడితే ఇన్ని నష్టాలా?



టెన్షన్ పడితే ఏమవుతుందిలే అని తేలిగ్గా తీసుకుంటున్నారా? అయితే మీరు ప్రమాదంలో ఉన్నట్టే! నిరంతరం ఒత్తిడికి గురవ్వడం వల్ల మన శరీరంలో 'కార్టిసాల్' వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి సైలెంట్ పాయిజన్ లాగా పనిచేస్తూ గుండె, మెదడు మరియు జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి. కేవలం మానసిక సమస్యగానే కాకుండా, ఒత్తిడి వల్ల వచ్చే శారీరక మార్పులు ఏంటో తెలిస్తే మీరు వెంటనే జాగ్రత్త పడతారు. ఆర్థిక ఇబ్బందులు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు.. ఇలా కారణం ఏదైనా కావచ్చు, కానీ మీరు పడే టెన్షన్ మిమ్మల్ని అకాల వృద్ధాప్యానికి గురి చేస్తోంది. అతిగా ఆలోచించడం వల్ల జుట్టు రాలడం నుండి గుండె జబ్బుల వరకు ఎన్నో అనర్థాలు ఉన్నాయి. హార్మోన్ల అస్తవ్యస్తం: ఒత్తిడి పెరిగినప్పుడు కార్టిసాల్, అడ్రినలిన్ హార్మోన్లు విపరీతంగా విడుదలవుతాయి. దీనివల్ల రక్తపోటు (ఃఖ) పెరిగి గుండెపై ఒత్తిడి పడుతుంది. జీర్ణ సమస్యలు: టెన్షన్ వల్ల ఎసిడిటీ, మలబద్ధకం మరియు జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కొందరిలో ఆకలి చచ్చిపోతే, మరికొందరు అతిగా తిని ఊబకాయం బారినపడతారు. రోగనిరోధక శక్తి పతనం: నిరంతర ఒత్తిడి వల్ల బాడీలోని ఇమ్యూనిటీ తగ్గుతుంది. ఫలితంగా తరచూ జలుబు, జ్వరం మరియు అంటువ్యాధులు సోకుతాయి. స్త్రీ, పురుషుల సమస్యలు: మహిళల్లో రుతుక్రమ సమస్యలు, పురుషుల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ఇది సంతానలేమికి కూడా దారితీయవచ్చు. మెదడుపై ప్రభావం: జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా యోగా చేయాలి. ప్రతిరోజూ 7-8 గంటల గాఢ నిద్ర అవసరం. సానుకూల మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలి. అవసరమైతే థెరపిస్ట్ సలహా తీసుకోవాలి.

# చలికాలంలో గోరు వెచ్చనీ నీళ్లు తాగే అలవాటు ఉందా?

శీతాకాలంలో చలి రోజురోజుకూ పెరిగేకొద్దీ చల్లటి నీరు తాగడానికి చాలా మంది ఇష్టపడరు. బదులుగా కాస్త వేడిగా ఉండే నీరు లేదా గోరువెచ్చని నీరు తాగడం ప్రారంభిస్తారు. ఇటువంటి వాతావరణంలో శరీర అవసరాలు భిన్నంగా ఉంటాయి. తాగే నీరు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ఆరోగ్య నిపుణులు కూడా శీతాకాలంలో చల్లటి నీరు తాగడం అంత మంచిది కాదని అంటున్నారు. ఈ కాలంలో గోరువెచ్చని నీరు తాగడం చాలా మంచిదట. గోరువెచ్చని నీరు శరీరాన్ని లోపల నుండి సమతుల్యతలో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియ నుంచి రోగనిరోధక శక్తి వరకు ఎన్నో రకాలుగా మంచిది. అంతే కాదు ఈ అలవాటు వల్ల ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఢిల్లీ ఓఅఆ కి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ ప్రకారం గోరువెచ్చని నీళు తాగడం వల్ల శరీర అంతర్గత ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇది జలుబు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా జీర్ణవ్యవస్థను చురుకుగా ఉంచడం ద్వారా గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. గోరువెచ్చని నీరు శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి సహాయపడుతుంది. మూత్రపిండాలు, కాలేయం మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. శీతాకాలంలో ఇది కీళ్లలో దృఢత్వాన్ని, కండరాల ఉద్రిక్తతను తగ్గిస్తుంది. అంతేకాకుండా ఇది గొంతు నొప్పిని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. తద్వారా కాలానుగుణ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శీతాకాలంలో దాహం తక్కువగా ఉన్నప్పటికీ, శరీరానికి తగినంత నీరు అవసరం. సాధారణంగా ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగాలి. ఇది వయస్సు, బరువు, రోజువారీ కార్యకలాపాలపై ఆధారపడి ఉంటుంది. ఒకేసారి నీళ్లు తాగడానికి బదులుగా రోజంతా కొద్ది కొద్దిగా నీళ్లు తాగడం మంచిది. ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనితో పాటు ఎక్కువగా టీ, కాఫీ తాగకుండా ఉండాలి. ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం చేయడం, తగినంత నిద్ర పొందడం మర్చిపోవద్దు.

## నితీష్ రెడ్డి అసలు ఆల్ రౌండరే కాదు: తెలుగు క్రికెటర్‌పై మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిపై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి ఆల్ రౌండర్ కాదని.. అతను కేవలం బ్యాట్స్?మెన్ మాత్రమేనని అన్నాడు. బీసీసీఐ ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి అంత మంచిదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆల్ రౌండర్ పేరుతో నితీష్ జట్టులో టీమ్ సెటప్ సరిగ్గా లేక కెప్టెన్?కు కంపర్టబుల్?గా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశాడు. టీమ్?లో అతడు ఆరవ బౌలర్ కాదని.. నిజానికి అతనొక పార్ట్ టైమ్ బౌలర్ అని అభివర్ణించాడు. అసలు జట్టులో నితీష్ రెడ్డి పాత్ర ఏంటో నాకు అర్థం కావడం లేదని.. టీమిండియా కోచ్, మేనేజ్‌మెంట్ దయచేసి టీమ్?లో అతడి పాత్ర ఏంటో తనకు చెప్పాలని కోరాడు. రాజ్?కోట్ వేదికగా న్యూజిలాండ్?తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ప్లేయింగ్ లెవన్ ఎంపికపైన కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. నెమ్మదిగా ఉన్న రాజ్‌కోట్ పిచ్?పై టీమిండియా నలుగురు పేసర్లతో ఆడిందని.. కానీ పర్యాటక న్యూజిలాండ్ జట్టు రాజ్ కోట్ పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకుందన్నారు. స్పిన్ వారి బలం కాకపోయిన న్యూజిలాండ్ ఈ మ్యాచులో ముగ్గురు స్పిన్నర్లతో ఆడిందని గుర్తు చేశారు. అసలు రెండో వన్డే కోసం ఎంపిక చేసిన జట్టు వ్యూహమేంటో తనకు అర్థం కాలేదన్నాడు. అసలు జట్టులో నితీష్ కుమార్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించాడు. నితీష్ అస్సలు ఆల్ రౌండరే కాదని కైఫ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కైఫ్ వ్యాఖ్యలపై

నితీష్ అభిమానులు మండిపడుతున్నారు. కాగా, రాజ్ కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైన విషయం తెలిసిందే. పర్యాటక న్యూజిలాండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఈ మ్యాచులో గెలిచి సిరీస్?ను 1-1 సమం చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 17న మధ్యప్రదేశ్ లోని ఇండోర్ వేదికగా జరగనుంది.

## ఇండియా ఓపెన్‌లో ముగిసిన భారత పోరాటం.. క్వార్టర్ ఫైనల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ 2117, 1321, 1821తో చైనీస్ తైపీకి చెందిన వరల్డ్ 13వ ర్యాంకర్ లిన్ చున్-యీ చేతిలో ఓడిపోయాడు. గంటా 8 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను గెలిచి శుభారంభం చేశాడు. కానీ తర్వాతి రెండు గేమ్స్‌లో అనూహ్యంగా తడబడిన సేన్.. అనవసర తప్పిదాలు చేశాడు. గురువారం జరిగిన మెన్స్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి 25-27, 21-23, 19-21తో హీరోకి మిడోరికావా -- క్యోహీ యామాషితా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. అయితే, మూడో గేమ్‌లో ఇరు జంటలూ 15-15తో సమానంగా ఉన్నప్పుడు ఒక షాట్ ఆడే క్రమంలో సాత్విక్ నెట్‌ను తాకాడని చైర్ అంపైర్ 'ఫాల్ట్'గా ప్రకటించడం వివాదాస్పదమైంది.

**స్టేడియంలో కోతులు, పక్షులు..షట్లర్ల ఇక్కట్లు..**

ఈ టోర్నీలో కాలుష్యం, చలి వంటి వాతావరణ సమస్యలతో పాటు ఇందిరా గాంధీ ఇండోర్‌స్టేడియంలో పక్షుల రెట్టలు పడటం, కోతులు ప్రత్యక్షమవ్వడం వంటి వింత సంఘటనలు నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. గురువారం హెచ్ ఎస్ ప్రణయ్ మ్యాచ్ సందర్భంగా పక్షుల రెట్టలు కోర్టులో పడటం వల్ల ఆట నిలిచిపోవడంపై ఆటగాళ్ళు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ఇక వాయు కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడం కష్టమవుతోందని లో కీన్ యూ వంటి ఇంటర్నేషనల్ స్టార్లు ఫిర్యాదు చేశారు. ఈ విమర్శలపై స్పందించిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ స్టేడియం నిర్వహణలోని లోపాలను అంగీకరిస్తూనే, భవిష్యత్తులో జరగబోయే వరల్డ్ చాంపియన్‌షిప్ నాటికి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది.

## డబ్ల్యూపీఎల్: బలమైన ముంబై ఇండియన్స్ ను ఓడించిన యూపీ వారియర్స్



- ముంబై ఇండియన్స్‌పై యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో గెలుపు
- హాఫ్ సెంచరీలతో చెలరేగిన యూపీ బ్యాటర్లు మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్
- 188 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో తడబడిన ముంబై
- అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ పోరాడినా ఫలితం శూన్యం
- యూపీ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జట్టుకు విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో యూపీ వారియర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 22 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌లో కెప్టెన్ మెగ్ లానింగ్ (70), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (61) హాఫ్ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ముంబై జట్టులో అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది.

188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్, 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఛేదనలో ముంబై టాప్ ఆర్డర్ విఫలమవడంతో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అమేలియా కెర్ (28 బంతుల్లో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్ (24 బంతుల్లో 41) ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించి పోరాడారు. అయితే, వీరిద్దరి పోరాటం జట్టును గెలిపించడానికి సరిపోలేదు. యూపీ బౌలర్లలో శిఖా పాండే రెండు వికెట్లు తీయగా, మిగతా బౌలర్లు సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించారు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ కిరణ్ నవగిరె (0) డకౌట్ అయినా, కెప్టెన్ మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ ముంబై బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తూ రెండో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. లానింగ్ 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 పరుగులు చేయగా, లిచ్‌ఫీల్డ్ 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ మూడు వికెట్లు పడగొట్టింది.

# నాగ్ 100 కోట్లు కొట్టాలంటే..

తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు టాలీవుడ్ కింగ్ నాగార్జున. కెరీర్ స్టార్టింగ్ నుంచే ప్రయోగాత్మక సినిమాలు, విభిన్న పాత్రలతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్ ను పూర్తిగా యూజ్ చేసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే నాగార్జున ప్రస్తుతం తన కెరీర్ లో 100వ సినిమాను చేస్తున్నారు. కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్ తో







తెరకెక్కుతున్న ఆ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ.. యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది. సినిమాలో నాగార్జున లుక్, క్యారెక్టర్ పూర్తిగా కొత్తగా ఉంటుందని సమాచారం. కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో నాగ్ కు రూ.100 కోట్ల హిట్ ఎప్పుడు సొంతమవుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కెరీర్ లో ఎన్నో సినిమాల్లో నటించినా.. ఆ మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఆయనతో పాటు సీనియర్ హీరోలు అయిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మాత్రం ఇప్పటికే పలు రూ.100 కోట్ల సినిమాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో నాగార్జున అభిమానుల్లో ఈ అంశం మరింత ఆసక్తిగా మారింది.అయితే ఇప్పుడు నాగార్జునకు రూ.100 కోట్ల హిట్ రావాలంటే అనిల్ రావిపూడితో సినిమా చేయాలని అనేక మంది సినీ ప్రియులు, నెటిజన్లు, కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలతో ఆయన చేసిన సినిమాలు పండగల సీజన్ లో భారీ వసూళ్లను సాధించాయి.ఇప్పటివరకు అనిల్ రావిపూడితో పని చేయని సీనియర్ హీరోల్లో నాగార్జున ఒకరే మిగిలారు. అందుకే ఆ కాంబినేషన్ వస్తే నాగ్ కెరీర్ కు ఇది సరైన టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఫుల్ ఎంటర్టైనర్ అయినా, కొత్తదనం ఉన్న కథ అయినా అనిల్ రావిపూడి హ్యాండిల్ చేయగలరనే నమ్మకం ఇండస్ట్రీలో ఉంది. అంతేకాదు సీరియస్ టోన్ ను కూడా సక్సెస్ ఫుల్ గా చూపించగలరు. ఇప్పటికే భగవంత్ కేసరి మూవీతో అది నిరూపించారు.అదే సమయంలో అనిల్ సినిమాలు తక్కువ బడ్జెట్ లో వేగంగా పూర్తవుతాయి. దీంతో నాగార్జున నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. నాగార్జున, అనిల్ కాంబినేషన్ లో సినిమా వస్తే, అది నాగ్ కు ఫస్ట్ రూ.100 కోట్ల హిట్ గా నిలిచే అవకాశం ఉందని ఆయన అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరేం జరుగుతుందో.. ఆ కాంబోలో ఎప్పుడు మూవీ వస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com